

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్‌కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావు తదితరులు

# రైతులకు భయపడే కేటీఆర్‌కు నోటీసులు

- **ఫార్ములా- ఈ రేస్ కేసులో విషయం లేదు**
- **వ్యూహం ఫలించక రేవంత్ బొక్కబోర్లా**
- **మామగారి సంవత్సరీకం ఉన్నా విచారణకు హాజరైన కేటీఆర్**
- **రేవంత్ చేతిలో తోలుబొమ్మలా ఏసీబీ**
- **మీడియాతో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): రైతు భరోసా విషయంలో మాట తప్పిన రేవంత్‌రెడ్డిపై రైతుల ఆగ్రహాన్ని దారి మళ్లించేందుకే కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు పంపించారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయలేక కొత్త చిక్కులు కొని తెచ్చుకుంటున్నారని విమర్శించారు. రైతులకు ఎకరాకు రూ.15 వేలు పంట సాయం ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడేమో రూ.12 వేలే ఇస్తామని చావు కబురు చల్లగా చెప్పారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ సర్కార్ ఆగడాలను అడుగడుగునా ఎండగడుతూ రైతుల పక్షాన పోరాడుతున్న కేటీఆర్‌ను ఫార్ములా-ఈ రేస్ అనే చెత్త కేసుతో జైలుకు పంపాలని కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. తన మామగారి సంవత్సరీకం ఉన్నప్పటికీ ఏసీబీ విచారణకు హాజరయ్యేందుకు కేటీఆర్ వెళ్లారని జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి తప్పూ చేయలేదు కాబట్టే ఏసీబీ విచారణకు ఆయన హీరోలా వెళ్లారని స్పష్టంచేశారు. లాయర్‌ను అనుమతించకుండా ఆయనను పోలీసులు 45 నిమిషాలు రోడ్డుపై నిలబెట్టారని తెలిపారు. కేటీఆర్ లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తానంటే.. విచారణాధికారే ఆయన దగ్గరకు వచ్చి లేఖ తీసుకెళ్లడంతో రేవంత్‌రెడ్డి బొక్క బోర్లా పడ్డారని ఎద్దేవా చేశారు.

### వైఫల్యాన్ని డైవర్ట్ చేసేందుకే గ్రీన్‌కో డ్రామా

సీఎం రేవంత్‌రెడ్డి పాలనను గాలికొదిలి డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలం వెళ్లదీస్తున్నారని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఫార్ములా వన్ కంటే ముందే గ్రీన్‌కో ఎలక్టోరల్ బాండ్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. హైకోర్టుకు ఏసీబీ సమర్పించిన 200 పేజీల రిపోర్టులో గ్రీన్‌కో ప్రస్తావన ఎందుకు లేదని ప్రశ్నించారు. రైతుల్లో తిరుగుబాటు మొదలవడం వల్లనే రేవంత్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌పై ఏసీబీ విచారణ డ్రామాలో వైఫల్యం చెందడంతో పనికిమాలిన చెత్తవార్తలు మీడియాకు లీకుల రూపంలో ఇసున్నారని దుయ్యబట్టారు. కేటీఆర్‌పై తన వ్యూహం బెడిసి కొట్టడంతో ఎలక్టోరల్ బాండ్స్ విషయాన్ని ఏదో కొత్తగా కనిపెట్టినట్టుగా మీడియాకు లీకులిచ్చారని విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్స్ వ్యవహారం ఇప్పటిది కాదని, గ్రీన్‌కో కంపెనీ అన్ని పార్టీలకు ఎలక్టోరల్ బాండ్స్ ఇచ్చిందని చెప్పారు. కాంగ్రెస్‌కు కూడా రూ.27 కోట్ల విరాళాలు ఇచ్చిందని తెలిపారు. చాలా పార్టీలకు బాండ్స్ ఇచ్చాయని, ఇందులో దాపరికం ఏమీ లేదని పేర్కొన్నారు. రేవంత్ తన పరువు పోతుందని ఈ డైవర్షన్ రాజకీయం తెరపైకి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు జ్ఞాపకశక్తి తక్కువ అనే భ్రమల్లో సీఎం రేవంత్ ఉన్నారని, అన్ని విషయాలు గుర్తుంచుకుంటారని స్పష్టంచేశారు. సీఎం ఆఫీస్ ఇచ్చిన ప్రతి చెత్త వార్తను ప్రచురించడం, ప్రసారం చేయడం తగదని హితవు పలికారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్‌కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## కేసుల పేరిట డైవర్షన్ డ్రామాలు

- **42% బీసీ రిజర్వేషన్లు ఎగ్గొట్టేందుకు ఎత్తుగడలు**
- **మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫైర్**

హైదరాబాద్, జనవరి 6 (నమస్తేతెలంగాణ): కేసుల పేరిట కాంగ్రెస్ సర్కారు డైవర్షన్ డ్రామాకు తెరలేపిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఫార్ములా-ఈ కార్ రేస్‌ను రద్దు చేసి రాష్ర్టానికి తీరని నష్టం మిగిల్చిందని ఆరోపించారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిలదీస్తున్న కేటీఆర్‌ను అణచివేసేందుకే తప్పుడు కేసులు పెడుతున్నదని మండిపడ్డారు. లాయర్ల సహాయం తీసుకోవద్దంటూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% కోటాను ఎగ్గొట్టేందుకు యత్నిస్తున్నదని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు గెల్లు శ్రీనివాస్, గజ్జెల నగేశ్, కిశోర్‌గౌడ్, కీర్తిలత పాల్గొన్నారు.



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో మాజీ మంత్రులు సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, పోచంపల్లి, ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్

# పాలన చేతగాక కక్ష సాధింపు

- **గొంతు నొక్కేందుకే తప్పుడు కేసులు**
- **ఫార్ములా-ఈపై బహిరంగ విచారణకు సిద్ధం**
- **ఏసీబీ రాజభక్తిని ప్రదర్శిస్తున్నది**
- **పోలీసులు చట్టపరిధిలో పనిచేయాలి**
- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): హామీల అమలుపై పట్టుబడుతున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే రేవంత్ సర్కారు తప్పుడు కేసులు బనాయిస్తున్నదని, పాలన చేతగాకే కక్ష సాధింపులకు దిగుతున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్ణయం మేరకే ఫార్ములా-ఈ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంటే అనవసర రాద్ధాంతం చేస్తున్నదని నిప్పులు చెరిగారు. ఫార్ములా- ఈ రేస్‌పై జూబ్లీహిల్స్‌లోని రేవంత్ ఇంట్లో బహిరంగ విచారణకు బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉన్నదని సవాల్ చేశారు. రైతు భరోసా కుదింపు నుంచి దృష్టి మళ్లించేందుకే రేవంత్‌రెడ్డి డైవర్షన్ డ్రామాలాడుతున్నారని ధ్వజమెత్తారు.. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఫార్ములా-ఈ ఒప్పందంలో ప్రభుత్వపరంగా తీసుకున్న నిర్ణయానికి కేటీఆర్‌పై కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రేవంత్ సర్కారు రాష్ట్రంలో యథేచ్ఛగా పౌరహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నదని, చట్టబద్ధ సంస్థలను ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేస్తున్నదని దుయ్యబట్టారు. విచారణ సంస్థలు సైతం రేవంత్ ఆడే రాజకీయ క్రీడలో పావులుగా మారడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పోలీసులు కూడా సర్కారు ఇచ్చే తాయిలాలకు ఆశపడకుండా చట్టపరిధిలో వ్యవహరించాలని సూచించారు. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన ఏసీబీ అమితమైన రాజభక్తిని ప్రదర్శిస్తున్నదని ఆరోపించారు. 'హైకోర్టులో తీర్పు రిజర్వ్ ఉన్న కేసులో కేటీఆర్‌ను విచారణకు పిలువడంలో అంతర్యమేంటి? న్యాయవాదులను అనుమంతించకపోవడంలోని ఔచిత్యమేంటి? రాజ్యాం గం కల్పించిన హక్కు మేరకే కేటీఆర్ న్యాయవాదులను తీసుకెళ్తే అభ్యంతరమేంటి?' అని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. పట్నం నరేందర్‌రెడ్డి విషయంలోనూ ఇలాగే వ్యవహరించి తప్పుడు స్టేట్‌మెంట్లు నమోదు చేయించారని ఆరోపించారు. కేటీఆర్ విషయంలోనూ అదేతీరులో వ్యవహరించేందుకే లాయర్లను నిరాకరిస్తున్నారని అనుమానం వ్యక్తంచేశారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా కేటీఆర్ తన న్యాయవాది ద్వారా స్టేట్‌మెంట్ అందించారని చెప్పారు. ఇప్పటికైనా సర్కారు తప్పుడు కేసులు బనాయించడం మాని రాష్ట్రాభివృద్ధిపై దృష్టిపెట్టాలని హితవు పలికారు. సమావేశంలో మాజీ మంత్రులు సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఆళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రేవంత్ జేబుసంస్థలా ఏసీబీ: ఎర్రోళ్ల



హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి జేబు సంస్థలా ఏసీబీ వ్యవహరిస్తున్నదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే ఫార్ములా ఈ రేస్ కేసులో అక్రమంగా నగదు బదిలీ జరిగినట్టు నిరూపించాలని సవాల్ విసిరారు. ఈ కేసు రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పరాకాష్ట అని మండిపడ్డారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ఎండగడుతున్నందుకే కేటీఆర్‌ను జైలుకు పంపాలని కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.


**SALAR JUNG MUSEUM, HYDERABAD**

e-Publishing Notice

Tenders are in invited under e-publishing platform for Sanitation Maintenance services of floor area including toilets cleaning in Salar Jung Museum from **01/02/2025 to 31/01/2026.**

Tenderers can download the tender schedules from procurement site i.e www.eprocure.gov.in/CPPP. Submission of tenders offline at Salar Jung Museum, Hyderabad.

| | | |
|---|---|---|
| Bid publish date | : | 07.01.2025, 10.00 AM |
| Bid Submission closing date | : | 22.01.2025, 3.00 PM |
| Bid opening Date | : | 22.01.2025, 3.30 PM |

Further details can be seen at **www.eprocure.gov.in/cppp.**
- 1) Tender ID: 2025_SJM_784205_2.

Sd/-
DIRECTOR






స్వాగతం

RASHTRAPATI NILAYAM Udyan Utsav

**ఫ్లవర్ & హార్టికల్చర్ ఫెస్టివల్, 2025**

**02 నుండి 13 జనవరి, 2025 వరకు ప్రజల కొరకు తెరిచి ఉంటుంది**

**ఉ. 10.00 గం. నుండి రా. 8.00 గం. వరకు**

**రాష్ట్రపతి నిలయం, బొల్లారం, సికింద్రాబాద్, తెలంగాణ వద్ద**

గౌరవనీయ భారత రాష్ట్రపతి అధికారిక శీతాకాల విడిది అయిన సికింద్రాబాద్‌లోని సుందరమైన రాష్ట్రపతి నిలయంలో జరిగే ఈ ఉత్సవం వల్ల పౌరులతో లోతైన బాంధవ్యాన్ని పెంపొందించుకోవాలనే రాష్ట్రపతి స్వప్నం నెరవేరుతుంది మరియు ప్రకృతి వైభవాలను మరియు స్థిరమైన ఉద్యానవన భవిష్యత్తును అన్వేషింపజేస్తుంది.

**ఆకర్షణలు**

- ఉత్సాహభరితమైన పూల ప్రదర్శనలు
- సేంద్రియ వ్యవసాయం, పట్టణ వనసంరక్షణ, వ్యర్థాల పునరావర్తనం మరియు స్థిరమైన హార్టీకల్చర్ వంటి అంశాలపై వర్క్‌షాపులు
- ప్రకృతితో మరింత అనుబంధాన్ని పెంపొందించడానికి పిల్లలు మరియు యువకుల కొరకు వర్క్‌షాపులు
- పర్యావరణం, స్థిరమైన పద్ధతులు మరియు హరితవర్ణమైన జీవనంపై మక్కువ గల వ్యక్తులతో నెట్‌వర్క్‌కు అవకాశం
- ప్రకృతి మరియు స్థిరత్వాన్ని జరుపుకునే సాంస్కృతిక కార్యక్రమాలు
- వినోద కార్యకలాపాలు మరియు అభ్యాస అనుభవాల కొరకు కిడ్స్ జోన్
- ప్రామాణికమైన దక్షిణ భారత వంటకాలతో ఫుడ్ కోర్ట్
- జానపద మరియు గిరిజన నృత్య ప్రదర్శనలు

ప్రకృతి, స్థిరత్వం మరియు వైవిధ్యంను జరుపుకోండి

ప్రవేశం ఉచితం ఇక్కడ బుక్ చేసుకోండి

CBC 01102/13/0009/2425

ప్రవేశం గేట్ నెం.2 నుండి

రాష్ట్రపతి భవన్ | సాంస్కృతిక మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం | వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ | MANAGE

రిజిస్ట్రేషన్ కొరకు www.visit.rashtrapatibhavan.gov.in



